
సాక్షి జగిత్యాల

బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



రేణుక ఎల్లమ్మ బోనాలు

జగిత్యాలరూరల్: తిమ్మాపూర్‌లో మంగళవారం రేణుక ఎల్లమ్మతల్లిబోనాల పండుగ ఘనంగా నిర్వహించారు.



అంజన్నకు మొక్కులు

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం వేలాదిమంది భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
33.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటి పూట ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

కేసీఆర్ నాయకత్వంపై ఆశలు

- రాష్ట్ర సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్
- ధర్మపురి, జగిత్యాల, మెట్‌పల్లిలో బీఆర్‌ఎస్ ప్లీనరీలు
- భారీసంఖ్యలో హాజరైన గులాబీ శ్రేణులు



జగిత్యాల ప్లీనరీకి హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు



ధర్మపురిలో మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, వేదికపై పలువురు బీఆర్‌ఎస్ ప్రతినిధులు

బుగ్గారం(ధర్మపురి): మనదేశం సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి ఎస్‌హెచ్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్లీనరీలో ఆయన మాట్లాడారు. తొలుత అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించి మొత్తం తొమ్మిది అంశాలపై తీర్మానాలు చేసి ఆమోదించారు. మంత్రి కొప్పుల మాట్లాడుతూ, తెలంగాణ ఆవిర్భావం తర్వాత అద్భుతమైన ప్రగతి సాధ్యపడిందన్నారు. కాళేశ్వరం వంటి ప్రపంచస్థాయి ప్రాజెక్టును అతి తక్కువ కాలంలో పూర్తిచేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. దేశాన్ని దశాబ్దాలపాటు పాలించిన కాంగ్రెస్, బీజేపీలు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర సందర్భంగా చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ధర్మపురి నియోజకవర్గం గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీటీసీలు బాదినేని రాజేందర్, గోస్కుల జలేందర్, సుధారాణి, పద్మజ, ఎంపీపీలు కూనమల్ల లక్ష్మి, బలరాంరెడ్డి, అనసూయ, బాదినేని రాజమణి, చిట్టిబాబు, నక్క శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి స త్తెమ్మ, ఏఎంసీ చైర్మన్లు అయ్యోరి రాజేశ్‌కుమార్, ప త్తిపాక వెంకటేశ్, బుచ్చిరెడ్డి, కాంపెల్లి హన్మాండ్లు, నాయకులు భీమయ్య, ఆకుల రాజేశ్, మొగిలి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం

జగిత్యాల: తెలంగాణ అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన అందిస్తున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ ప్లీనరీ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భవించాక సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఆయన పేదల పక్షపాతి అని పేర్కొన్నారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకుడు జితేందర్‌రావు పాల్గొన్నారు.

దేశానికి రోల్‌మోడల్..

మెట్‌పల్లి(కోరుట్ల): దేశానికి తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలవడం గర్వ కారణమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. స్థానిక వీఆర్‌ఎం గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్లీనరీలో ఆయన మాట్లాడారు. కొద్ది కాలంలోనే అభివృద్ధి, సంక్షేమంలో అగ్రస్థానంలో నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. తన హయాంలో నియోజకవర్గంలో వరద కాల్వ, ఎస్సారెస్పీ నీటితో భూములు సస్యశ్యామలమయ్యాయని పేర్కొన్నారు. ప్రతినెలా 70వేల మందికిపైగా ప్రతినెలా రూ.14.37కోట్ల ఆసరా పింఛన్లు చెల్లిస్తున్నామని తెలిపారు. రూ.94.05 కోట్లు వెచ్చించి విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించి సమస్యలు పరిష్కరించామని తెలిపారు. కోరుట్ల, మెట్‌పల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతుల కల్పనకు రూ.47కోట్లు కేటాయించామన్నారు. 250 ఆలయాల అభివృద్ధికి రూ.25కోట్లతో టీటీడీకి ప్రతిపాదనలు పంపామని వివరించారు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు సంజయ్ పోటీ చేస్తారని, తనలాగే ఆయనను ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు పలువురు నాయకులు మాట్లాడుతూ వచ్చేఎన్నికల్లో సంజయ్‌ని భారీమెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌లు రాణవేని సుజాత, అన్నం లావణ్య, జెడ్పీటీసీలు కముటం భారతి, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీలు మారు సాయిరెడ్డి, జాజాల భీమేశ్వరి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు చీటీ వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

ప్రత్యేక రాష్ట్రంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాకే జగిత్యాల అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో జరిగిన బీఆర్‌ఎస్ ప్లీనరీలో ఆయన మాట్లాడారు. గతంలో 23వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంటే ఇప్పుడది 64 వేల ఎకరాలకు చేరిందన్నారు. 4,520 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిర్మించుకున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ, కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.600కోట్లు వెచ్చిస్తున్నారన్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయ్యేలా కృషి చేయాలని ఆయన కోరారు. జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, దేశంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ మాట్లాడుతూ, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మీ, కేసీఆర్ కిట్, ఆరోగ్య మహిళ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్ట్.. ఇవన్నీ కేసీఆర్ ఘనతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడారు. ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్, జగిత్యాల, రాయికల్ మున్సిపల్ చైర్మన్లు గోలి శ్రీనివాస్, మోర హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్


రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



కాల్‌సెంటర్ పరిశీలిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు, రైస్‌మిల్లర్లకు ఇబ్బందులు కలుగకుండా కాల్ సెంటర్ అందుబాటులోకి తీసుకొచ్చామని కలెక్టర్ యాస్మిన్‌బాషా అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్‌ను మంగళవారం ఆమె సందర్శించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారు. ఎఫ్ఏక్యూ నిబంధనలు పాటించాలని, ప్రతీఅధికారి క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమచేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 1800 425 8187ను ఉదయం 8 నుంచి సాయంత్రం 8 గంటల వరకు సంప్రదించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లత, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



ధ్వజారోహణలో పీఠాధిపతులు, భక్తులు

కథలాపూర్(వేములవాడ): పోటీ ప్రపంచంలో మనుషులు బిజీగా ఉంటున్నారని, మానసిక ప్రశాంతత కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని శ్రీసత్యానందాశ్రమ పీఠాధిపతి శ్రీహరి తీర్థస్వామి సూచించారు. చింతకుంట శ్రీతారకేశ్వరస్వామి దేవాలయం, సత్యానంద్రాశమ వార్షికోత్సవం, శంకర జయంతి ఉత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఉదయం శ్రీతారకేశ్వరస్వామికి రుద్రాభిషేకం, ధ్వజారోహణం, యజ్ఞం నిర్వహించారు. ప్రత్యేక భజనలు చేశారు. ఈసందర్భంగా పీఠాధిపతి మాట్లాడారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శ్రీవిరజానంద తీర్థస్వామి, మాతా పరమేశ్వర నందగిరి, హరిప్రియ మాతాజీ, సునంద మాతాజీ, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

జిల్లాకు వర్షసూచన

జగిత్యాలఅగ్రికల్చర్: రాబోయే ఐదు రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఓ మోస్తారు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈనెల 26న ఉరుములు, మెరుపులు, వడగళ్లతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. గంటకు 40 కి.మీ. నుంచి 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. 27, 28 తేదీల్లోనూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆయన సూచించారు.

ఆహా.. ఆహ్లాదం

- పరుచుకున్న పచ్చదనం
- వినసొంపైన పక్షుల కిలకిలరావాలు
- ముచ్చటగొలుపుతున్న నాట్యమయూరాలు
- జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ ప్రత్యేకత
- గోల్డెన్ గార్డెన్ అవార్డు సొంతం చేసుకున్న వైనం



జాతీయ జెండా చుట్టూ పరుచుకున్న పచ్చదనం

జగిత్యాల: సుమారు పాతిక ఎకరాల సువిశాల విస్తీర్ణం.. అప్పటికే ఉన్న పెద్దపెద్ద చెట్లు.. కనువిందు చేసే మొక్కలు.. సువాసనలు వెదజల్లే పూలతీగలు.. నేలతల్లిన కప్పేసిన పచ్చనిగడ్డి.. కిలకిలమంటూ చేసే పక్షుల కూతలు.. నాట్యం చేసే నెమళ్లు.. ఇదేదో దట్టమైన అటవీప్రాంతం మాత్రం కాదు.. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టర్ కార్యాలయాల భవన సముదాయంలోని అద్భుతమైన ఉద్యానవనం ప్రత్యేకత ఇది.. దాదాపు రూ.15లక్షల వ్యయంతో ఉద్యాన వనం నిర్మించారు.. సిబ్బంది కంటికి రెప్పలా కాపాడుతున్నారు.. అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.. ఆహ్లాదం పంచేందుకు అవసరమైన అన్నిచర్యలూ తీసుకుంటున్నారు.. అందుకే ఈ ప్రాంతం ఇప్పుడు ఫొటోషూట్ స్పాట్‌గా మారింది..

54శాఖలు ఒకేచోట..

- జగిత్యాల జిల్లాగా ఆవిర్భవించడంతో పట్టణ రూపురేఖలు మారిపోయాయి. ప్రజలకు పాలనను ఒకేచోట అందించాలనే లక్ష్యంతో ఇటీవల సమీకృత కలెక్టర్ భవన సముదాయం నిర్మించారు. 54ప్రభుత్వ శాఖలను ప్రజలకు ఇందులోనే అందుబాటులోకి తీసుకొచ్చారు.

చెట్లను వదిలేసి..

- ధరూర్ క్యాంప్‌లోని సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో జిల్లా సమీకృత భవన సముదాయం నిర్మాణం చేపట్టారు. అయితే, అంతకు ముందే అక్కడ పెద్దపెద్ద చెట్లు ఉన్నాయి. వాటికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఇంజినీరింగ్ అధికారులు పక్కా ప్లాన్ చేసి భవన సముదాయం నిర్మించారు. దీంతో ఏళ్ల నాటి చెట్లు ఇప్పటికీ తమ ప్రత్యేకత, పచ్చదనం కోల్పోకుండా అటుగా వెళ్లిన వారిని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ఎకోఫ్రెండ్లీ కలెక్టరేట్..

- కలెక్టరేట్‌లోని ఉద్యానవనం పక్షులు, చిన్న చిన్న జంతువులకు ఆవాసంగా మారింది. ప్రధానంగా అంతరించి పోతున్న పిచ్చుకలకు ఎంతోసురక్షిత ప్రాంతంగా గార్డెన్‌ను తీర్చిదిద్దారు. నాట్యం చేసే మయూరాలనూ తెప్పించి స్వేచ్ఛగా వదిలేశారు. సందర్శకులతోపాటు మయూరాలు కూడా గార్డెన్‌లో తచ్చాడుతూ ఆటక్టుకుంటున్నాయి. ఎకోఫ్రెండ్లీ కలెక్టరేట్‌గా తీర్చిదిద్దిన ఈ ప్రాంతం అన్నివేళలా ఆహ్లాదం పంచుతోంది.

అటవీ అధికారులకు అభినందనలు

ఉద్యానవనం నిర్మించేందుకు జిల్లా అటవీ శాఖ అధికారులు ఇచ్చిన ప్రణాళిక అద్భుతంగా ఉందని, ఇందుకు గోల్డెన్ గార్డెన్ అవార్డు రావడం నిదర్శనమని కలెక్టర్ యాస్మిన్ బాషా అభినందించారు. వివిధ రకాల పక్షలు, మయూరాలు వంటివాటికి స్వేచ్ఛ లభించేలా గార్డెన్‌లో చోటు లభించిందని, ఇందుకు వారి కృషి అభినందనీయమని ప్రశంసించారు. గార్డెన్‌ను కంటికి రెప్పలా కాపాడుతున్న కలెక్టరేట్ సిబ్బంది, పర్యవేక్షిస్తున్న అధికారులనూ కలెక్టర్ అభినందించారు.



గార్డెన్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్న మయూరం



పచ్చని తీగలపై స్వేచ్ఛగా తిరుగుతున్న పిట్ట

'ప్రత్యేకత'కు అవార్డు

ఎక్కడా లేనివిధంగా జగిత్యాల జిల్లా సమీకృత భవన సముదాయాల్లో నిర్మించిన ఉద్యానవనం ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. ఇటీవల హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లో ఉద్యాన శాఖ నిర్వహించిన ఏడో గార్డెన్ ఫెస్టివల్‌లో కలెక్టర్ కార్యాలయంలోని ఉద్యానవనం ప్రత్యేక గుర్తింపు పొందింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి ద్వారా అటవీశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు గోల్డెన్ గార్డెన్ అవార్డు అందుకున్నారు.



ఆకట్టుకుంటున్న కలెక్టరేట్ ముఖద్వారం



ఆహ్లాదం పంచుతున్న పచ్చదనం



ఇరువైపులా పచ్చని చెట్లతో మెయిన్ గేట్

వెంటాడుతున్న వానలు



కొడిమ్యాల : పూడూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో భారీగా చేరిన వర్షపునీరు

- జిల్లాలో ఏకధాటి వర్షం
- మామిడి, వరి, మొక్కజొన్న, నువ్వు పంటలకు తీవ్రనష్టం
- లబోదిబోమంటున్న అన్నదాతలు

జగిత్యాల/జగిత్యాలరూరల్/మల్యాల/కథలాపూర్/రాయికల్/కొడిమ్యాల/ఇబ్రహీంపట్నం: జిల్లాలో గురువారం రాత్రి ప్రారంభమైన ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన భారీవర్షం మంగళవారం కూడా వదిలిపెట్టలేదు. మంగళవారం సాయంత్రం వివిధ మండలాల్లో ఏకధాటిగా కురిసిన వానలతో చేతికి వచ్చిన మామిడి, వరి, నువ్వు, మొక్కజొన్న, కర్బూజ, కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జిల్లాకేంద్రంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గ్రామాల్లో వర్షం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వరి, నువ్వు, మామిడిపంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యంపై కప్పిన కవర్లు ఈదురుగాలుల ధాటికి కొట్టుకుపోవడంతో వడ్లు తడిసి ముద్దయ్యాయి.

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో..

సారంగాపూర్(జగిత్యాల): సారంగాపూర్‌ని అన్ని గ్రామాల్లో నువ్వుపంట నేలవాలింది. పెంబట్లలో పుచ్చకాయ పంట పూర్తిగా దెబ్బతింది. బీర్‌పూర్ మండలంలో ధాన్యం తడిసిపోయింది. సారంగాపూర్‌లో ప్రధాన విద్యుత్ స్తంభాల ఇన్సులేటర్లు పగిలి సరఫరా నిలిచిపోయింది.

యాసంగి పంట నష్టం 42వేల ఎకరాలు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఈ యాసంగిలో సుమారు 4.30లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేశారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వడగళ్లు, వర్షాలు, ఈదురుగాలులతో దాదాపు 42,774 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమిక నివేదికలు రూపొందించారు.



సారంగాపూర్ : వర్షపు నీటిలో కొట్టుకుపోతున్న వడ్లు



సారంగాపూర్ : నేలవాలిన నువ్వు



సారంగాపూర్ : దెబ్బతిన్న కర్బూజపంట





తడిసిన ధాన్యం చూపుతున్న రైతులు



కథలాపూర్ : ధాన్యం ఆరబెడుతున్న రైతులు



పెంబట్ల కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపునీరు

కల్యాణం.. కమనీయం



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న బ్రాహ్మణులు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్



కల్యాణానికి హాజరైన భక్తులు

వెల్గటూర్(ధర్మపురి): కోటిలింగాల శ్రీకోటేశ్వరస్వామి కల్యాణం వైశాఖ శుద్ధ పంచమి మంగళవారం కన్నులపండువగా జరిగింది. పవిత్ర గోదావరి తీరంలోని ఆలయ ఆవరణలో పార్వతీకోటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని వేదమూర్తులు వేదమంత్రాలు, బాజాభజంత్రీల నడుమ వైభవంగా జరిపించారు. పూలతో అందంగా అలంకరించిన వేదికపై గౌరీసమేతుడైన శ్రీకోటేశ్వరస్వామిని ఆశీనులను చేసి కల్యాణ క్రతువు నిర్వహించారు. అంతకుముందు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు హాజరయ్యారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పొనుగోటి శ్రీనివాసరావు అన్నదానం చేశారు. సర్పంచ్ నక్క మౌనిక, ఈవో కాంతారెడ్డి, ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, జెడ్పీటీసీ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంట నష్ట పరిహారం చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోరుట్ల: రైతులకు ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందించాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదు రోజులుగా జిల్లాలో అకాల వర్షాలతో పాటు ఈదురు గాలులకు వరి, నువ్వు తదితర పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం నామమాత్రపు సర్వేలు చేయించవద్దని, రైతులకు తక్షణమే నష్ట పరిహారం అందించాలన్నారు. అలాగే ప్రధానమంత్రి ఫసల్ బీమా అమలు చేయాలని, తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

మోడల్ దోబీఘాట్ల నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అదనపు కలెక్టర్ మకరంద్

రాయికల్(జగిత్యాల): రాయికల్ పట్టణంలో రూ.2కోట్ల వ్యయంతో నిర్మించే మోడల్ దోబీఘాట్ల నిర్మాణానికి మంగళవారం అదనపు కలెక్టర్ మకరంద్ స్థలాన్ని పరిశీలించారు. అలాగే ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట కమిషనర్ గంగుల సంతోష్‌కుమార్, తహసీల్దార్ ఖయ్యూం, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: 2022–23 సంవత్సరానికి గాను శారీరక వైకల్యం కలిగి ఉన్న, ఉన్నత విద్యనభ్యసించే నిరుద్యోగులకు ఉప కరణాలు మంజూరు మంజూరయ్యాని, వాటికిగాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంక్షేమాధికారి నరేశ్ తెలిపారు. అర్హులైన దివ్యాంగులు WWW. TSOBMMS. CGG. GOV. IN ద్వారా 26 నుంచి వచ్చేనెల 6 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాకు 15 రిట్రోఫైడ్ ద్విచక్ర వాహనాలు, 11 వీల్‌చైర్లు, 7 ల్యాప్‌టాప్‌లు, 1 డైసీ ఎంపీత్రీప్లేయర్, 19 స్మార్ట్ ఫోన్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు

జగిత్యాల: జిల్లాలో ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పదో తరగతిలో 457 మంది విద్యార్థులకు గాను 397 మంది హాజరయ్యారని, 60 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. అలాగే ఇంటర్‌లో 526 మంది విద్యార్థులకు 451 మంది హాజరు కాగా, 75 మంది గైర్హాజరైనట్లు వివరించారు. జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రంలో ఇద్దరు విద్యార్థులను డిబార్ చేసినట్లు తెలిపారు. విధులు సక్రమంగా నిర్వహించని ఇన్విజిలేటర్లను సైతం తొలగించినట్లు చెప్పారు.

జోరుగా ఐపీఎల్ బెట్టింగ్..!

- బెంగుళూరు, గోవా, ముంబయ్, ఢిల్లీ, హైదరాబాద్ నుంచి లింకులు
- ఆన్‌లైన్‌లోనే లావాదేవీలు

జగిత్యాలక్రైం: జిల్లాలో ఐపీఎల్ బెట్టింగ్ జోరుగా సాగుతోంది. బెంగుళూరు, గోవా, ముంబయ్, ఢిల్లీ, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఉన్న క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లు జిల్లాలో క్రికెట్ ఆటపై మోజు ఉన్న యువత, వ్యక్తులను టార్గెట్ చేసుకుంటుండగా, ఐపీఎల్ బెట్టింగ్‌లో రోజూ రూ.లక్షల్లో చేతులు మారుతున్నాయి. క్రికెట్ ఆట జరుగుతున్న సమయంలోనే ఆన్‌లైన్‌లో ఆయా జట్లకు మద్దతుగా కొందరు, గెలుపోటములపై మరికొందరు, ఫోర్లు, సిక్స్‌లు కొట్టడంపై కొందరు, బౌలింగ్, వికెట్లు తీసేవారిపై ఇంకొందరు బెట్టింగ్ కాస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం రూ.1,000 నుంచి రూ.లక్షల వరకు బెట్టింగ్ పెడుతున్నారు. ఇందులో గెలిచిన వారికి తాము పెట్టిన డబ్బులకు వందశాతం, రెండు వందల శాతం అంటూ తిరిగి చెల్లిస్తారు. అయితే గతంలో నగదురూపంలో బెట్టింగ్ సాగితే.. ఇప్పుడు అంతా ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు సాగుతున్నాయి.

బెట్టింగ్‌లో యువత

ఐపీఎల్‌తో పాటు అంతర్జాతీయ టీ–20 క్రికెట్ పోటీలు జరుగుతున్నాయంటే చాలు జిల్లాలోని యువత తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలవుతోంది. బెట్టింగ్ వ్యసనానికి అలవాటు పడిన వారు ఇంట్లో ఉన్న డబ్బులు దొంగతనం చేయడం, భూమి పత్రాలు తీసుకెళ్లి కుదువపెట్టి డబ్బులు తీసుకున్న సంఘటనలు చాలా ఉన్నాయి. ఇతరుల వద్ద లక్షల రూపాయలు అప్పులు చేసి బెట్టింగ్లో పెట్టి నష్టపోయిన వారు.. అప్పులు తీర్చలేక, ఎవరికీ చెప్పుకోలేే మద్యానికి బానిసలైన వారు సైతం ఉన్నారు. అయితే ఈ జూదంలో పాల్గొంటున్న వారిలో రాజకీయ నాయకులు, బడా వ్యాపారుల కుటుంబ సభ్యులతోపాటు, సామాన్య, మధ్య తరగతికి చెందిన వారు కూడా ఉంటున్నారు. దీంతో బయటకు చెప్పుకుంటే పరువు పోతుందని, కుమారులు చేసిన అప్పులను గుట్టు చప్పుడు కాకుండా తల్లిదండ్రులు చెల్లిస్తున్నారు.



అంతా ఫోన్ల ద్వారానే..

ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న సందర్భంలో జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్‌లకు పాల్పడే వారంతా తమ సెల్‌ఫోన్లు వెంట పెట్టుకుని రహస్య ప్రాంతాల్లో మకాం వేసి బెట్టింగ్‌లు పెడుతున్నారు. దీంతో గెలిచినా, ఓడినా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరుపుతున్నారు. తమ బ్యాంక్‌ఖాతాల వివరాలు ముందే బెట్టింగ్ నిర్వాహకులు తీసుకుని లావాదేవీలు కొనసాగిస్తున్నారు.

బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు



క్రికెట్‌పై ఇష్టం ఉంటే చూడాలే తప్ప ఎలాంటి బెట్టింగ్‌లకు పాల్పడొద్దు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఐపీఎల్ జరుగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా నిఘా పటిష్టం చేశాం.

– ఎగ్గడి భాస్కర్, ఎస్పీ

రెగ్యులర్ చేయాలని మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

గొల్లపల్లి(ధర్మపురి): జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషనరీ కాలం మూడేళ్లు ముగిసిందని, రెగ్యులరైజ్ చేయాలని మంగళవారం ధర్మపురి నియోజకవర్గ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఎంతో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్యదర్శులు నోటిఫికేషన్ ప్రకారం మూడు సంవత్సరాలు పూర్తి చేసుకోవడం జరిగిందని, వెంటనే ప్రభుత్వం తమను క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో మల్లికార్జున్, షరీఫ్, రాజు, కృష్ణారెడ్డి, కిరణ్, కనకలక్ష్మి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

బుగ్గారం(ధర్మపురి): అకాల వర్షానికి ధర్మపురి మార్కెట్‌లో ధాన్యం తడిసిపోయింది. నాలుగైదు రోజుల నుంచి కోతలు మొదలవడంతో మార్కెట్ ధాన్యపు రాశులతో నిండిపోయింది. సుమారు రెండు వేల క్వింటాళ్ల వరకు ధాన్యం మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉంది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం అకాల వర్షానికి పలు ధాన్యం కుప్పలు తడిసిపోయాయి.

తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన మంత్రి

కమలాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ సందర్శించారు. ఈ సందర్భంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు అధైర్యపడవద్దని ప్రభుత్వం వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తుందని పేర్కొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

- డీఎంహెచ్‌వో పుప్పాల శ్రీధర్

జగిత్యాల: మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో పుప్పాల శ్రీధర్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీఎల్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ బాధ్యతతో మలేరియా నిర్మూలనకు పాటుపడాలని, మలేరియా వ్యాధి ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అన్నారు. వణుకు, చమటతో కూడిన చలిజ్వరం, తలనొప్పి, రోజు విడిచి రోజు జ్వరం వస్తుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని మురికినీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులతో ఏటా అనేక మంది మరణిస్తున్నారని, ప్రజల్లో అవగాహన తప్పనిసరిగా రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు సమియొద్దీన్, ఆకుల శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, రవిశంకర్, స్వాతి, శోభారాణి, సత్యనారాయణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

ఎన్ని కేసులు పెట్టినా నిరుద్యోగ దీక్ష ఆగదు

- వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చెదల సత్యనారాయణ

కోరుట్లరూరల్: రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్‌టీపీ నాయకులపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా నిరుద్యోగ దీక్ష ఆగదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెదల సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు సత్యనారాయణను మంగళవారం కోరుట్లలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను రాష్ట్ర ప్రభుత్వం అనునిత్యం హౌస్ అరెస్టులు చేస్తూ వేధిస్తోందన్నారు. ప్రతిపక్ష నాయకురాలిని టీఎస్‌పీఎస్సీ మీద మాట్లాడనీయక పోవడం, పాదయాత్ర రద్దు చేయడం, ఇందిరా పార్కువద్ద శాంతియుతంగా దీక్ష చేస్తామని హైకోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకున్నా జైల్లో వేసే ప్రయత్నం చేయటం ఇవన్నీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిరికి పంద చర్యలని విమర్శించారు. వైఎస్సార్‌టీపీ అంటే రాష్ట్ర ప్రభుత్వానికి భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. నిర్బంధాలు, అరెస్టులతో కేసీఆర్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అణగదొక్కే ప్రయత్నం చేస్తుందన్నారు. రాబోయే కాలంలో కేసీఆర్ పతనం తప్పదని, ప్రజలు ఈ ప్రభుత్వానికి త్వరలోనే బుద్ధి చెబుతారన్నారు.



సత్యనారాయణను హౌస్ అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం లక్ష్యం

జగిత్యాలరూరల్: ప్లాస్టిక్‌రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని సెర్ప్ అదనపు ప్రాజెక్ట్ సంచాలకుడు సుధీర్ కోరారు. స్థానిక సెర్ప్ కార్యాలయంలో రూరల్, అర్బన్ మండలాల మహిళా సమాఖ్యల సమావేశాలు మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మహిళా సంఘాలు ఆర్థికాంశాలపై చక్కటి ప్రతిభ కనబర్చుతూ ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సామాజిక అంశాలపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. ఇంటికొక ఇంకుడు గుంత, తడి, పొడిచెత్త సేకరణపై అందరికీ అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధీ నేషనల్ ఫెలో నవ్య, ఏపీఎం గంగాధర్, సీసీలు విద్యాసాగర్ రావు, గంగారాం, సంతోష్, రాజేందర్, మహిళా సంఘాల సభ్యులు భారతి, జమున, సంధ్యారాణి, పద్మ పాల్గొన్నారు.



ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్న సుధీర్

బీజేపీని గద్దె దించేవరకు ఉద్యమం ఆగదు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాటం ఆగదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. పల్లె పల్లెకు సీపీఐ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వ హయాంలో నిత్యావసర వస్తువులతో పాటు, పెట్రో ధరలు పెరిగాయని, ఒకే దేశం ఒకే విధానం పేరుతో మనిషికి అత్యవసరమైన మందులపై కూడా 12 శాతం భారం వేశారని పేర్కొన్నారు. భారత్‌లో ఒక్క హిందువులకే చోటు అన్న ఆర్ఎస్ఎస్ విధానంతో దేశంలో డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగానికి అతీతంగా చేస్తున్న కుట్రలను తిప్పికొట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు.

ప్రజాసమస్యలపై నిరంతర పోరాటం

బుగ్గారం(ధర్మపురి): ప్రజాసమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని చాడ వెంకటరెడ్డి అన్నారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా మంగళవారం ధర్మపురిలో పర్యటించారు. గాంధీ కూడలిలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు.



సారంగాపూర్‌లో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మేడిపెల్లి(వేములవాడ): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మేడిపెల్లి మండల కేంద్రంలో పర్యటించారు. కొనుగొలు కేంద్రాల్లోని వరి ధాన్యాన్ని వెంటనే కొనుగొలు చేసి, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, సీపీఐ జిల్లా అధ్యక్షుడు వెన్న సురేష్, నాయకులు చెన్న విశ్వనాథం, బోయిన అశోక్, గూడెం లక్ష్మి, మల్లక్క, పద్మ మునుగురి హన్మంతు, దేవదాసు, గంగాధర్, రాములు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలను విస్మరించిన ప్రభుత్వాలు

రాయికల్(జగిత్యాల): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదల సంక్షేమాన్ని విస్మరించాయని సీపీఐ జాతీయ నేత చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయికల్ పట్టణంలో నిర్వహించిన సీపీఐ ప్రజా చైతన్యయాత్రలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, దళితబంధు, మూడెకరాల భూమి అందిస్తామని ప్రకటించి విఫలమయ్యిందని, కేంద్రం గ్యాస్, పెట్రో ధరలను పెంచడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. దేశ స్వాతంత్ర్య ఫలాలు అందజేయడమే సీపీఐ లక్ష్యమన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

జగిత్యాల: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం చేపట్టామని ఆర్టీసీ డీఎం నర్సప్ప మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. ఇందుకోసం 99592 25925 మొబల్‌నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

మందుబాబులకు జైలు, జరిమానా

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన ఆరుగురిని ట్రాఫిక్ పోలీసులు కోర్టులో హాజరుపరచగా ఓ వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష, రూ.1,500 జరిమానా, మిగతావారికి రూ.6,500 జరిమానా విధించారు. రోజూ నగరంలో డ్రంకెన్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్‌లు ఉంటాయని, మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష అనుభవించవలసి ఉంటుందని కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

కరీంనగర్‌క్రైం: అదనపు కట్నం కోసం భార్యను వేధించడం తోపాటు ఆమెపై అనుమానం పెంచుకొని రోకలిబండతో కొట్టి చంపిన నేరంలో భర్త మొగుళ్ళ పరశురాం (32)కు జీవిత ఖైదుతో పాటు రూ.17 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా జడ్జి బి.ప్రతిమ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలం చెప్యాలకు చెందిన దయ్యాల కవితకు రామడుగు మండలం కిష్టరావుపల్లికి చెందిన మొగుళ్ల పరశురాంతో 2012లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. అనంతరం భార్యను అనుమానించడంతోపాటు అదనపు కట్నం కోసం వేధించగా కొంత డబ్బు చెల్లించినా అతడి తీరు మారలేదు. 2018 ఆగస్టు 14న సాయంత్రం ఇంట్లో భార్యతో గొడవపడిన పరుశురాం ఆమెను రోకలి బండతో తలపై కొట్టగా తీవ్ర గాయాలతో కవిత (25)చనిపోయింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఆశాలు ఇచ్చిన ఫిర్యాదుపై రామడుగు ఎస్సై రవి కేసు నమోదు చేయగా అప్పటి రూరల్ ఏసీపీ ఉషారాణి దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి ప్రతిమ నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

మహిళలకు జీవనోపాధి కల్పించే దిశగా 'విజన్ బిల్డింగ్'

కథలాపూర్(వేములవాడ): మహిళలకు జీవనోపాధి కల్పించే దిశగా 'విజన్ బిల్డింగ్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సెర్ప్ డీపీఎం మాణిక్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కథలాపూర్‌లోని స్త్రీ శక్తి భవన్‌లో మండలంలోని అన్ని గ్రామాల మహిళ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లోని మహిళలు జీవనోపాధికోసం ఏమి చర్చించారో వాటిని ప్రణాళిక ప్రకారం అమలు చేయాలన్నారు. విజన్ బిల్డింగ్ కార్యక్రమం ఐదేళ్లపాటు ఉంటుందని, ఈ ఏడాది ప్రణాళిక గురించి గ్రామాలవారీగా అడిగి తెలుసుకొని వారికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆడిటర్ దాస్, ఏపీఎం నరహరి, సీసీలు విజయ నిర్మల, అంజయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



విజన్ బిల్డింగ్‌పై చర్చిస్తున్న మాణిక్‌రెడ్డి

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

జగిత్యాలరూరల్: ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్ర యాణించాలని డీఎం వెంకటనర్సప్ప కోరారు. మంగళవారం గుల్లపేట, అర్పపల్లి, సారంగాపూర్ వరకు ఆర్టీసీ బస్సును ఆయన ప్రారంభించారు. బస్సులో ప్రయాణిస్తే ఆర్టీసీకి లాభం చేకూరుతుందని, రాయితీ బస్‌పాస్‌లతో ప్ర యాణికులకూ ప్రయోజనం చేకూరుతుందని ఆయన అన్నారు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు తిరుపతి, లత, ఎంపీటీసీ దమ్మ సురేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ గూడ లింగారెడ్డి, ఆర్టీసీ అ సిస్టెంట్ మేనేజర్ విజయలక్ష్మి, టీఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బస్సు ప్రారంభిస్తున్న డీఎం వెంకటనర్సప్ప

ఆర్టీసీని ఆదరించండి

సారంగాపూర్(జగిత్యాల): ప్రజలు ఆర్టీసీని ఆదరించాలని జగిత్యాల డీఎం నర్సప్ప కోరారు. అర్పపల్లికి ఆర్టీసీ బస్సు ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ కొండ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

- ఇద్దరికి తీవ్రగాయాలు
- నుజ్జునుజ్జు అయిన బైక్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఫెర్టిలైజర్ సిటీ టౌన్‌షిప్‌లో.. ఆర్ఎఫ్‌సీఎల్ గేట్ వద్ద రాజీవ్ రహదారిపై మంగళవారం ఓ లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఎస్.కె షాబీర్ కుడికాలు పాదం విరిగిపోయింది. ఎస్‌కే.ఇస్మాయిల్ గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం .. ఇస్మాయిల్, షబీర్ పెంచికల్‌పేట నుంచి ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్ మీదుగా సంజయ్‌గాంధీనగర్‌కు వెళుతున్నారు. ఈ క్రమంలో ఆర్ఎఫ్‌సీఎల్ మెటీరియల్ గేట్‌కు యాష్ లోడ్ కోసం వెళ్తున్న లారీ డ్రైవర్ ఒక్కసారిగా రాంగ్ రూట్‌లోకి తిప్పడంతో ద్విచక్ర వాహనదారులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న ఇస్మాయిల్‌కు గాయాలు కాగా వెనక కూర్చున్న షాబీర్ కాలుకు తీవ్రమైన గాయమైంది. స్థానికులు 108కు సమాచారం అందించడంతో అంబులెన్స్‌లో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. షాబీర్ పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎన్టీపీసీ ఎస్సై జీవన్‌ను సంప్రదించగా.. ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.



తీవ్రంగా గాయపడిన షబ్బీర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని అగ్గిమల్ల గ్రామానికి చెందిన సంగెం గంగారాం(65) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. ఈనెల 20న రాత్రి 9 గంటలకు గొల్లపల్లి మండల కేంద్రంలోని వైన్స్ ముందు సంగెం గంగారాం రోడ్డు దాటుతుండగా లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మారు మధుకర్‌రెడ్డి అతివేగంగా ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. దీంతో గంగారాంకు తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు సంగెం సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

వెల్గటూర్(ధర్మపురి): పెళ్లి కాదనే బాధతో మనోవేదనకు గురై ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కిషన్‌రావుపేటలో జరిగింది. పోలీసుల వివరాలు.. కిషన్‌రావుపేటకు చెందిన బోగె ప్రసాద్(22) మూడు నెలల క్రితం ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇంట్లో వాళ్లకు ఆ పెళ్లి ఇష్టం లేకపోవడంతో వారు ఆ అమ్మాయిని వదిలిపెట్టమని చెప్పడంతో వదిలేశాడు. నెల క్రితం ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్ వెళ్లి ఈ నెల 22న తిరిగి ఇంటికి వచ్చాడు. అప్పటి నుంచి మనోవేదనకు గురవుతూ బాధ పడుతుండేవాడని, ఈ నెల 24న రాత్రి 11 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. అదే రోజు రాత్రి కిషన్‌రావుపేటకు చెందిన బోగె చిన్నయ్య వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పెళ్లి కాదనే బాధతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.



ప్రసాద్(ఫైల్)

జగిత్యాల డీఎస్పీకి మాతృవియోగం

జగిత్యాల క్రైం: జగిత్యాల డీఎస్పీ రత్నాపురం ప్రకాశ్ తల్లి నర్సుబాయి (70) మంగళవారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందారు. బుధవారం ఉదయం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాగా ప్రకాశ్ తల్లి మృతిపై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సంతాపం తెలిపారు.



నర్సుబాయి (ఫైల్)